# శ్రీ రమణ జ్యోతి

సంపుటి-45 సంచిక - 6 హైదరాబాదు జూన్, 2025 పేజీలు - 52 రూ. 10/- సంవత్సర చందా : రూ. 100/-

# SRI RAMANA JYOTHI

Vol - 45 Issue - 6 Hyderabad June, 2025 Pages - 52 Rs. 10/- Annual Subscription Rs. 100/-



**BHAGAVAN SRI RAMANA MAHARSHI**



*ARUNACHALA HILL* (అరుణాచల గిరి)

స్మరణమా త్రముననె పరముక్తి ఫలద । కరుణామృ తజలధి యరుణాచ లమిది ॥

శ్రీ రమణ జ్యోతి — **Sri Ramana Jyothi**

జూన్ 2025 — June 2025


ఈ సంచికలో ... — IN THIS ISSUE ...


| | | | |
|---|---|---|---|
| **1.** | **డా॥ కే.యస్. గారి 130వ ప్రవచనం** | రామదాస్ మూర్తి | 3 |
| **2** | **డా॥ టి.ఎన్. కృష్ణ స్వామి** | సరోజా ప్రసాద్ | 6 |
| **3.** | **అజ్ఞాత వ్యక్తి** | రవికృష్ణ శర్మ | 8 |
| **4.** | **గంభీరం శేషయ్య** | ఫణిమాల | 15 |
| **5.** | **భగవాన్ భక్తులు - గోవులు** | రమేష్ బాబు | 19 |
| **6.** | **అనుస్మరణీయులు శ్రీ పిమ్మరాజు రామ సుబ్బారావు** | | 28 |
| 7. | The Universal Mother | Dr K Subrahmanian | 30 |
| 8. | Ashtavakra Gita 37 | V Krithivasan | 35 |
| 9. | Kamakshi | | 39 |
| 10. | Sraddha: Earnestness or Faith | | 43 |
| 11. | Aryani Nallur | Sneha Choudhury | 45 |
| 12. | Miracles | Katya Osbourne | 49 |


## Events in Sri Ramana Kendram in June 2025

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 26th - Punarvasu Satsang - 6.30 - 7.30 p.m.
3. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.

(పాఠకులు దయచేసి తమ ఫోన్ నంబరు,e- మెయిల్ అడ్రెస్, శ్రీ రమణకేంద్రం ఆఫీసుకు వెంటనే ఫోన్ చేసి తెలియజేయగలరు)

(Readers are requested to kindly intimate the Sri Ramana Kendram Office, their Phone Number and e-mail address)


© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.


**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**

**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# అనన్య భక్తి

డా॥ కే.యస్. గారి 130వ ప్రవచనం

అనువాదం: రామదాస్ మూర్తి

అర్జునుడు తనకంటే శ్రీకృష్ణుడిని ఎక్కువ ప్రేమించేవారు ఉన్నారా అని శ్రీకృష్ణుడిని అడిగాడు. అర్జునుడు తానే అందరికంటే శ్రీకృష్ణుడిని ఎక్కువగా ప్రేమించే వాడిని అన్న గాఢమైన అభిప్రాయం కలిగి ఉండేవాడు. శ్రీకృష్ణుడు ఆ ప్రశ్నకు సమాధానం ఇవ్వలేదు. ఆ తరువాత వారిద్దరూ కలిసి నడుస్తున్న సమయంలో శ్రీకృష్ణుడు ఒక ఇంట్లోకి వెళదామన్నాడు.

ఆ ఇంట్లో ముగ్గురు వ్యక్తులు ఉన్నారు - భార్య, భర్త, ఎనిమిదేళ్ల కొడుకు. శ్రీకృష్ణుడిని వాళ్లు చూసిన వెంటనే ఎంతో సంతోషపడి పాద నమస్కారాలు చేశారు. తమ స్వంత ఇంటికి ఆయన రావడంతో తమకు మహా భాగ్యం కలిగిందన్నారు. కొద్దిసేపటి తరువాత, ఇంటి యజమాని తాము శ్రీకృష్ణునికి ఏమి చేయగలవో చెప్పమన్నాడు. ఏదో మామూలు విషయం మాట్లాడుతున్నట్టు శ్రీకృష్ణుడు తనకు ఆ ఇంటి కుమారుని కుడి కన్ను ఇవ్వగలరేమోనని అడగడానికి వచ్చాను, అన్నాడు. వాళ్లకు ఒక్కడే కొడుకు ఉన్నాడు అని కూడా తనకు తెలుసునని అన్నాడు.

## తండ్రికి తగ్గ తనయుడు

ఆ తండ్రి ఏమీ ఆలోచించకుండా సంతోషంగా "ఆ విషయాన్ని మీరు అడగాల్సిన అవసరమేముంది, తప్పక తీసుకోండి" అన్నాడు.

జవాబుగా శ్రీకృష్ణుడు "బాలుని కంటిని అతని అనుమతి లేకుండా ఎలా తీసుకొనగలను? తన కుడి కంటిని ఇవ్వడానికి బాలుడు ఇష్టపడతాడా?" అన్నాడు. వెంటనే ఆ అబ్బాయి "మా తండ్రి అన్నట్లు, ఇది నా అదృష్టం. అంతా మీదే, మీరు యథేచ్ఛగా తీసుకోవచ్చు" అన్నాడు.

కృష్ణుడు ఎంతో సంతోషించాడు. వారు చూపిన అంతటి ప్రేమ, భక్తి చూసి అర్జునునికి మాటలు రాలేదు. అంతటితో ఆగక, శ్రీకృష్ణుడు తాను ఒక షరతు మీద కంటిని తీసుకుంటానన్నాడు. కంటిని తీస్తున్నప్పుడు బాలుడు కన్నీరు పెట్టుకోకూడదు. అలా ఏడిస్తే వెంటనే కంటిని తీయడం ఆపేస్తానన్నాడు. బాలుడు "నేను ఏడవను, ఎందుకు ఏడవాలి? అంతా మీదే అయినప్పుడు మీది మీరు తీసుకుంటున్నారు" అని సమాధానం ఇచ్చాడు. అది విని అర్జునుడు నివ్వెరపోయాడు.

శ్రీకృష్ణుడు తన ఖడ్గాన్ని తీసి కంటిని పెకిలించాలని అనుకుంటున్న సమయంలో బాలుని ఎడమ కంటిలో నీరు కనిపించాయి. వెంటనే కృష్ణుడు "అదిగో నీ ఎడమ కన్ను నీరు కారుస్తోంది. నీవు మాట తప్పావు, అందుకే నీ కంటిని తీసుకోను" అన్నాడు. బాలుడు "ప్రభూ, మీరు పొరబడుతున్నారు. నేను ఏడవడం నా కుడి కంటిని తీస్తున్నందుకు కాదు. చూడండి, నా కుడి కంటిలో చుక్కనీరు లేదు. మీ చేత పెకిలింపబడడం లేదని, ఆ భాగ్యాన్ని తాను కోల్పోయినందుకు ఎడమ కన్ను బాధపడుతూ

నీరు కారుస్తోంది. అంతేకానీ, నేను దుఃఖపడడం లేదు. దయచేసి రెండు కళ్ళూ తీసుకోండి. ఒక దానిని తీసుకుంటే రెండవది బాధ పడుతుంది'' అని కృష్ణునికి పాద నమస్కారం చేశాడు.

**సంపూర్ణ శరణాగతి**

ఇదంతా గమనిస్తున్న అర్జునుడు, ఆ తల్లిదండ్రులకు, కుమారుడికి కూడా పాదాభివందనం చేశాడు. వాళ్ల భక్తి ప్రపత్తులను చూసిన అర్జునుడు తానే అందరికంటే ఎక్కువ కృష్ణ భక్తుడునని అనుకున్నాను. కానీ, ఆ బాలుడి భక్తితో పోలిస్తే తన ప్రేమ ఏపాటిదీ కాదన్నాడు. అతను తనది అసలు ఏదీ కాదనుకొని శరణాగతి చెందాడు. అలాంటి భక్తులు ఎందరో ఉండి ఉంటారు అని అర్జునుడు తెలుసుకున్నాడు. భగవంతుని అనుగ్రహం ఉంటే తప్ప, ఆ స్థాయిని ఎవరైనా అందుకోవడం అసాధ్యం. ఆయన కృప కలిగినప్పుడు అంతా ఆయన స్వంతమని, నిన్ను ఒక పనిముట్టుగా వాడుకుంటున్నాడని తెలియ వస్తుంది. ఏదీ నీది కాదు. అంతా భగవంతునికి చెందినది కనుక ఆయన ఇష్టం కొద్దీ వ్యవహారాలను నడిపిస్తూ ఉంటాడు. అది గ్రహిస్తే భక్తి పరమావధిని చేరుతుంది.

******

# మహర్షి వద్దకు నేను ఎలా వచ్చాను?
# డాక్టర్ టి.ఎన్. కృష్ణ స్వామి

శ్రీ రమణాశ్రమ ప్రచురణ Fragrant Petals లోని వ్యాసానికి స్వేచ్ఛానువాదం

సరోజా ప్రసాద్

నేను వైద్య విద్యార్థిగా ఉన్న రోజులవి. ఫైనల్ పరీక్షలు మరి కొద్ది నెలల్లో జరగవలసి ఉన్నది. కొందరు మిత్రులము కలసి విహార యాత్రగా వెల్లూరుకు బయలుదేరాము. నా కెమెరా కూడా వెంట తీసుకు వెళ్లాను. పాత కోటలోను, వెల్లూరులోని పురాతన రాతి చెక్కడాలను ఫోటోలు తీశాను. అంతకంటే అక్కడ చూడదగ్గది ఇంకేమీ లేకపోవడంతో, తిరువణ్ణామలైలో ఆలయం చాలా పెద్దదని, అక్కడి శిల్పకళ అద్భుతంగా ఉంటుందని మాలో ఒకరు సలహా ఇచ్చారు. దానితో వెంటనే తిరువణ్ణామలై బస్సు ఎక్కి అక్కడికి చేరుకున్నాము. ఆకాశన్నంటే గోపురాలను, అక్కడి శిల్పాలను చూసి ఆనందించాము. నాకు మంచి ఫోటోలు తీసే అవకాశం వచ్చిందని సంతోషించాను. రెండు మైళ్ళ అవతల ఉన్న శ్రీ రమణ మహర్షిని కూడా చూసివద్దాం అన్నారొకరు. ఒక గుఱ్ఱపు బండి మాట్లాడుకొని ఆశ్రమానికి బయలుదేరాము. మహర్షిని ఫోటో తీస్తే ఎలా ఉంటుంది? అని ఆలోచిస్తున్నాను. మేము అక్కడికి చేరేసరికి సాయంకాలమైంది. హాలులోనుండి సందర్శకులంతా వెళ్ళిపోయారు. మహర్షి కూడా అలవాటు ప్రకారం, వాహ్యాళి కోసం కొండపైకి వెళ్ళారు. అక్కడే కొద్దిసేపు నిరీక్షించాము. ఇంతలో ఒక పొడవాటి వ్యక్తి, చేతి కఱ్ఱతో నడుచుకుంటూ రావడం చూశాము. ఆయన చేతిలో కమండలం కూడా ఉన్నది. వెనుకే పలువురు

భక్తులు, వారిని అనుసరిస్తూ వస్తున్నారు. మహర్షి దర్శనానికి మేము సిద్ధమయ్యాము. వారి ఫోటో తీసుకోవచ్చునా? అని అడిగాను. “లేదు, వీలులేదని” చెప్పారు.

ఈ సంగతి మాట్లాడుతుండగానే, ఆ పొడవాటి వ్యక్తి మా వద్దకు వచ్చి, “ఏమిటి విషయం” అని అడిగారు. నేను ఎవరినైతే అనుమతి కోరానో, ఆయన, శేషు అయ్యర్, మా బృందం వైపు చూపిస్తూ “వీళ్ళంతా మద్రాస్ నుండి వచ్చారట. భగవాన్ ఫోటోలు తీసుకుంటామంటున్నారు” అని చెప్పారు. “ఓ అలాగా? తీసుకోమనండి” అన్నారు మహర్షి. అలా అంటూనే నడుముపైన చేతులు పెట్టుకొని తల కొంచెం ప్రక్కకు త్రిప్పి, ఫోటోకు అనువుగా నిలబడ్డారు. క్షణం కూడా వృథా చేయకుండా, నేను వెంటనే నా కెమెరా తీసి, ఫోకస్ చేసి, నాలుగైదు ఫోటోలు తీశాను. నేనేమీ ఆధ్యాత్మిక విషయాల కోసం ఇక్కడికి రాలేదు. అక్కడి పరిసరాల పవిత్రత కూడా, నాక అవగాహన కాలేదు. భగవాన్ మెల్లగా హాలు లోపలకి వెళ్లి, తనకోసం సిద్ధం చేసిన సోఫాలో ఆసీనులయ్యారు. ఒక టవలుతో తడిగా ఉన్న పాదాలను తుడుచుకొని, విశ్రాంతిగా సోఫాలో చేరగిలి కూర్చున్నారు. పరిసరాలతో ప్రమేయం లేదన్నట్లుగా, వారు తమలో తాము, లీనం కావడం ఆశ్చర్యం గొలిపింది. మేము కూడా హాలులోకి ప్రవేశించి, వారికి ఎదురుగా కొద్ది అడుగుల దూరంలో కూర్చున్నాము. మహర్షి తమ చుట్టూ దేనినీ గమనిస్తున్నట్లు అనిపించలేదు. ప్రశాంతంగా ఎటో చూస్తున్నారు. కనులు తేజస్సుతో వెలుగుతున్నాయి. వారిలో ఏదో దివ్యత్వం గోచరించింది.

******

# భగవాన్ నా జీవితంలోకి ఎలా ప్రవేశించారు?

# అజ్ఞాత వ్యక్తి

**శ్రీ రమణాశ్రమ ప్రచురణ Surpassing Love and Grace లోని వ్యాసానికి స్వేచ్ఛానువాదం**

**అనువాదకులు: రవికృష్ణ శర్మ**

చాలా మంది భక్తులకు భగవాన్ శ్రీ రమణ మహర్షి ఒక మూర్తీభవించిన విశ్వాధారమైన తండ్రి. ఎన్నో సందర్భాలలో చాలా మంది భక్తులు భగవాన్ ను దర్శించినప్పుడు స్వయంగా వారి తండ్రినే దర్శించినట్లుగా భావించారు.

నాకిప్పటికీ చాలా స్పష్టంగా గుర్తున్న విషయమేమిటంటే మా కుటుంబ స్నేహితుడు 1942లో ఒకసారి మాతో శ్రీ రమణాశ్రమం వచ్చినప్పుడు భగవాన్‌ను దర్శించగానే ఒక్కసారిగా ఆనందంతో "నా తండ్రి ఇక్కడ ఉన్నారు. జీవించి ఉన్న కాలంలో ఉత్తరార్ధంలో నా తండ్రి ఎలా ఉన్నారో, అలానే ఉన్నారు భగవాన్" అని అన్నారు. చాలా కాలం క్రితం 1933లో నా తండ్రి భగవాన్‌ను మొట్ట మొదట సారి దర్శించినప్పుడు వారు కూడా భగవాన్‌లో వారి తండ్రిని పోలిన పోలికలను చూశారు. ఈ మధ్యకాలంలో అంటే 1966లో నా తండ్రి మరణించిన తరువాత నేను కూడా భగవాన్‌లో నా తండ్రిని పోలిన పోలికలను చూసి కదిలిపోయాను. అటువంటి భావన నాకు కలగడం క్రొత్తేమీ కాదు. నిజానికి భగవాన్ శ్రీ రమణులు మూర్తీభవించిన జగత్పితరులు. ఈ విశ్వాన్నే కాక, విశ్వాన్ని అధిగమించిన వారు కూడా.

భగవాన్ మందిరానికి జరిగిన పవిత్రమైన మహాకుంభాభిషేకం సందర్భంగా శ్రీ భగవాన్ పాదపద్మాలకు అంజలి ఘటించటానికి విచ్చేసిన ఎంతోమంది విశిష్టమైన వ్యక్తులు తమ నివాళులను తమ తమ కలముల ద్వారా ప్రవహింపజేశారు. అటువంటి వారి వర్ణన ముందు నా వర్ణన ఎటువంటిదంటే మహోజ్వలంగా వెలుగుతున్న సూర్యుని ముందు దీపాన్ని చూపడం వంటిది. అయినా కూడా నాలో ఉన్న కాంక్ష వల్ల, నా జీవితంలో నాకు కలిగిన అత్యంత పవిత్రమైన మరియు విలువకట్టలేని అనుభవాన్ని ఎటువంటి తడబాటు లేకుండా తెలియపరుస్తాను. ఆ అనుభవం వేల సుగంధాలను వెదజల్లే గులాబీల మధ్యలో అల్పమైన పారిజాత పుష్పం వంటిది.

నా తండ్రి తరచుగా భగవాన్‌తో తనకు కలిగిన అనుభవాలను మరియు వారి కృపను గురించి జీవితంలో తనకు కలిగిన ఇతర అనుభవాలతో కలిపి గుర్తుచేసుకునేవారు. అవి గొప్ప ఆధ్యాత్మిక బోధతో కూడుకొని ఉండేవి. అప్పుడు నా వయసు 12 సంవత్సరములు. ఆ సంఘటనలను గురించి చెబుతున్నప్పుడు నేను వాటిని ఎంతో ఆసక్తితోను, శ్రద్ధతోను వినేవాడిని. వాటి ఫలితంగా అవి నా అంతరంగంలో లోతుగా పాతుకునిపోయి అప్పటికప్పుడు భగవాన్‌ను దర్శించుకోవాలనే తీవ్రమైన ఆకాంక్షను రేకెత్తించి వారిని ముట్టుకోవాలని, వారికి సమీపంగా ఉండాలని అనిపించే విధంగా చేసేది. నా నిత్యప్రార్థనలలో భగవాన్ రమణుల చిత్రపటం చూసినప్పుడు భగవాన్ ముఖ భాగము నందే నా దృష్టి నిలిచేది. దానితో తక్షణమే భగవాన్ దర్శనం కలగాలని కోరుకునే

వాడిని. కాలం గడుస్తున్న కొద్దీ దర్శించుకోవాలనే కోరిక తీవ్ర మౌతున్నది కాని నాకు ఎటువంటి పిలుపు రావడం లేదు. ఒకసారో లేదా రెండుసార్లో దానిని గురించి నా తండ్రితో చర్చించాను. కాని నా తండ్రి ఆ మాటలను పెద్దగా పట్టించుకోక పోగా ఇలా అన్నారు; "ఎప్పుడైతే భగవాన్ నిన్ను పిలుస్తారో, అప్పుడు మాత్రమే నీవు భగవాన్ వద్దకు వెళ్తావు" అని.

ఆ తరువాత ఒకరోజున నాకు మొదటి అనుభవం కలిగింది. 1945వ సంవత్సరం అనుకుంటాను, ఒక రోజు దీర్ఘ నిద్రలో ఉన్నప్పుడు ఒక రూములో, ఓ మూలన కూర్చుని, ఎవరి గురించో వేచి ఉన్నట్లు కలగన్నాను. అప్పుడు భగవాన్ రమణులు నెమ్మదిగా ఆ గదిలోకి రావడం నేను చూశాను. దానితో పరిగెత్తుకుంటూ వెళ్లి వెనుకనుండి భగవాన్ పొట్ట చుట్టూ రెండు చేతులు వేసి కౌగలించుకుని ఏడుస్తూ ప్రార్థించాను. కాని నన్ను పట్టించుకోకుండా అక్కడినుండి వెళ్లిపోయినట్లు నాకనిపించింది. నాకు మెలకువ రావడంతో లేచి కూర్చొని దానిని గురించి చాలాసేపు ఆలోచించాను.

భగవాన్ నుండి ఎటువంటి స్పందన లేకపోవడంతో నిరాశకు లోనైనట్లు అనిపించింది. కాని ఎట్టకేలకు భగవాన్‌ను దర్శించి ముట్టుకున్నాను కదా! అనే ధైర్యం కలిగింది. అదేమి నిరూపిస్తున్న దంటే భగవాన్ నన్ను విడిచిపెట్టలేదు అని.

ఇప్పుడు నేను భగవాన్‌ను గురించి మరింత ఎక్కువగా చింతించడం మొదలుపెట్టాను. అయినా కాని చాలా కాలం ఏమీ జరగలేదు.

మరల నాలో అలజడి నెలకొనడంతో ఆశను కోల్పోవడం మొదలైంది. అప్పుడు ఒక నిశి రాత్రి భగవాన్ కనిపించి ఎల్లలు ఎఱుగని కరుణతో నాకు దీక్షనిచ్చారు. ఈసారి అది ఒక కలలా కాకుండా దర్శనంలా అనిపించింది. నేనప్పుడు సగం నిద్రలో ఉండి పక్క మీదనుండి లేచి ఇంటి ముందున్న ప్రాంగణంలోకి వెళ్లాను. వాతావరణం అంతా నిశ్శబ్దంతో నిండి ఉన్నది. చిమ్మ చీకటి ఆవరించబడి ఆకాశం నక్షత్రాలతో కూడి ఉన్నది. నేను ఇసుక కుప్పమీద పశ్చిమ ముఖంగా నిలబడి నిశ్చలంగా అలా చూస్తూ ఉన్నాను. ఆ చిమ్మ చీకటి నుండి ఒక గిరి, పవిత్రమైన అరుణాచల గిరి వంటి ఆకారము కలిగినది నెమ్మదిగా బహిర్గతమైనది. అలా బయల్వెడలి ఒక ఛాయాచిత్రము వలె అర్థమయ్యేవిధంగా నీలాతి నీలమైన ఆకారంతో నిలచివున్నది. కొన్ని నిమిషముల తరువాత గిరి శిఖరము నండి ఒక చిన్న వెలుగు వెలువడింది. మొదట్లో అది ఒక నిటారుగా పెట్టిన కన్ను ఆకారాన్ని కలిగి క్షణాలలో పెద్దగా పెరిగి ఒక స్తంభాకారాన్ని ధరించి దివ్యాకృతితో దేదీప్యమానంగా అరుణగిరి శిఖరాన్ని ఆధారం చేసుకుని వెలుగులీనింది. ఆ వెలుగు, దిగంతాలను తాకింది. ఆ జ్యోతి వైభవం మాటలలో వర్ణించలేనిది. ఆ జ్యోతి ఆకారం దీపపు కాంతి వలె బంగారు వర్ణాన్ని కలిగి నిశ్చలంగా వెలుగుతూ వెయ్యి సూర్యులు ఒక్కసారిగా కాంతిని వెదజల్లినట్లు కనిపించింది. ఆ బంగారు కాంతి నా శరీరం మీద పడింది. దానితో నా శరీరం బిర్రబిగుసుకుపోయి కాళ్ళు, చేతులు కదల్చలేకుండా పూర్తి సమ్మోహనానికి గురైనవానివలె నిలబడిపోయి

వెలుగుతున్న ఆ బంగారు వర్ణపు కాంతిని చూస్తూ ఇతరమేదీ తెలియని స్థితిలో ఉండిపోయాను. నా మనస్సు ఆనందంతో ఉప్పొంగిపోయి శరీరం బద్దలవుతుందా అని అనిపించింది. ఎంతకాలం అలా నిలుచున్నానో చెప్పలేను. ఎందుకంటే అక్కడ కాలమనేదే లేదు కనుక. ఎప్పుడైతే మరల తెలివి వచ్చి చూశానో, అప్పుడు, అక్కడ ఉన్నది నేనొక్కడినే కాదు అని అనిపించింది. ఆ సమయంలో ప్రయత్నపూర్వకంగా కుడివైపు తల త్రిప్పి చూస్తే అక్కడ భగవాన్ శ్రీ రమణులు నిలుచొని నా వైపే చూస్తూ ఉన్నారు. వారి కన్నులు ఎల్లలెరుగని కరుణను మరియు ప్రేమను కురిపిస్తుంటే వారి పెదవుల చిరుమందహాసం నన్ను మంత్రముగ్ధుడిని చేసింది. ఎప్పుడైతే భగవాన్‌ను చూశానో జ్యోతిని మరియు ఇతరాన్ని చూడడం మరచిపోయాను. భగవాన్ పాదాలపై పడిపోవాలని అనిపించింది. కాని భగవాన్ సున్నితంగా తిరస్కరించి వారి అమృతహస్తాన్ని నా శిరస్సుపై ఉంచారు. ఆనందమే ఆనందం! భగవంతునికి అన్యం కానటువంటి భగవాన్ కరస్పర్శ చేత, నా శరీరమంతా, ఆంతరంగికంగాను మరియు బాహ్యంగాను పులకాంకితమయింది. ఆనంద తరంగాలు మరియు ప్రశాంతత నన్ను సంపూర్ణంగా ఆవరించాయి. భగవాన్, తమ చూపుడు వేలును ఆ బంగారు వర్ణపు కాంతి వైపు చూపి కంచు మ్రోగినట్లు మ్రోగే గొంతుతో ‘‘నాయనా, ఈ జ్యోతి అంటే ఏమిటో నీకు అర్థమయినదా? ఇదే నిజమైన కార్తీక దీపం’’ అని అన్నారు.

అంతటితో ఒక్కసారిగా నాకు మెలకువ వచ్చి బాధా తప్తమయిన ప్రపంచములోకి తీసుకురాబడ్డాను. కాలాంతరంలో

ఇటువంటి దర్శనాలు కలిగినా వాటన్నింటిలో భగవాన్‌ను పరమ ప్రేమైక మూర్తిగా దర్శించినప్పటికీ అవి ఏవీ ఇప్పుడు చెప్పిన దివ్యమైన దర్శనంతో మరియు ఉపదేశంతో సరిపోలవు.

ఇక అప్పటినుండి నేను భగవాన్‌ను భౌతికంగా ఆశ్రమానికి వెళ్లి దర్శించలేదే అన్న అసంతృప్తి నాలో కలుగలేదు. నిజం చెప్పాలంటే అప్పుడప్పుడూ అటువంటి అసంతృప్తి నాలో పొటమరించెడిది.

1942లో నేను కోయంబత్తూర్ నుండి మద్రాసుకు వెళ్తున్నాను. ఆ రాత్రి రైలు వేగంగా కొన్ని గిరులను ఆనుకొని వెళ్తునప్పుడు నాలో ఆశ్రమాన్ని దర్శించాలనే ప్రార్థనాపూర్వక ఆలోచన ఒక ఆకారాన్ని తీసుకున్నది. ఆ సమయంలో నేను నా తండ్రితో ప్రయాణిస్తున్నప్పటికీ, చిన్నవాడినైన నానుండి వచ్చే ఇటువంటి ఆలోచనలను నా తండ్రి ప్రోత్సహించరు. అందువల్ల నా భావాలను ఎవరితోనూ పంచుకొనలేదు. కొన్ని రోజుల తరువాత కోయంబత్తూర్ కు తిరిగి వస్తున్నప్పుడు, నా తండ్రి మనం రమణాశ్రమానికి వెళ్లి భగవాన్ దర్శనం చేసుకుందామా? అని ఒక్కసారిగా నన్ను అడిగారు. అలా అడగడంతో నా కళ్ళలో నీళ్ళు తిరిగి ఏడ్చేశాను. ఇలా చెప్పడానికి నేనేమీ సిగ్గు పడడం లేదు. ఈ దర్శనం, నా ప్రార్థనకు శ్రీ భగవాన్ ఎంతో అనుగ్రహంతో మంజూరు చేసినది.

మరుసటి రోజు మేము మా ఇంట్లో ఉన్నాము - అదే శ్రీ రమణాశ్రమం. ఆ రోజు శుక్రవారం మరియు అమావాస్య. భగవాన్ రమణుల దివ్య సన్నిధిలోనికి ప్రవేశించగానే నేను ఆనందము

మరియు ప్రశాంతత అనే అనంతసాగరంలో కరిగిపోతున్నాననే భావన నాకు కలిగింది.

ఉదయమంతా మేమక్కడే గడిపాము. అప్పుడు శ్రీ భగవాన్ తీక్ష్ణమైన దృక్కులతో క్షణకాలం పాటు నావైపు దృష్టి సారించి అనుగ్రహించారు. అంతే ఇంకేమీ జరగలేదు.

ఆ తరువాత శ్రీ భగవాన్ తమ భౌతిక దేహాన్ని త్యజించారని తెలిసినప్పుడు కొన్ని కన్నీటి చుక్కలు నా చెక్కిళ్ళ వెంబడి కారాయి. అది చూసిన నా తండ్రి "నువ్వొక మూర్ఖుడవు. భగవాన్ ఎక్కడికి వెళతారు?" అని గట్టిగా మందలించారు. సంవత్సరాలు గడిచి పోయాయి; అయినా ఆ కాగడాలో జ్యోతి రోజు రోజుకీ మరింత కాంతిని కూడగట్టుకుని వెలుగులీనుతూనే ఉన్నది. ఆ జ్యోతిని భగవాన్ తమ ఎల్లలెరుగని అనుగ్రహంతో నా హృదయంలో కూడా వెలిగించారు. ఇప్పుడు నా పిల్లలూ వాళ్ళ సమయం రావడంతో నన్ను ఈ విధంగా అడుగుతున్నారు: నాన్నా భగవాన్ తాత మా దగ్గరకు ఎప్పుడు వస్తారూ? అని. అలా అడిగినప్పుడు నాకెంతో సంతృప్తి కలుగుతుంది. కాని కొన్ని సార్లు ఇలా చెబుతాను "పిల్లలూ, అనుకూల సమయం వచ్చినప్పుడు వస్తారు. ఓరిమి వహించి, వేచి ఉండడం నేర్చుకోండి".

అంతిమ క్షణాలలో కాలపురుషుడు వచ్చినప్పుడు నా హృదయము భగవాన్‌కు శరణాగతి చెంది నా పెదవులు "ఓం నమో భగవతే శ్రీ రమణాయ" అంటూ ప్రాణాలు వదలాలని కోరుకుంటూ...

******

# శ్రీ రమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు
# గంభీరం శేషయ్య

**ఫణిమాల**

శ్రీ శివ ప్రకాశం పిళ్ళై, శ్రీ గంభీరం శేషయ్య, శ్రీ టి.ఎమ్.పి. మహాదేవన్ వంటి మేధావులు శ్రీ రమణుల వద్దకు ఈశ్వరునిచే పంపబడ్డారు. శ్రీ రమణులు లోకానికి ఉపదేశించినటువంటి ఉన్నతమైన జ్ఞానోపదేశం సాధారణ భక్తులకు అర్థమయ్యే రీతిలో గురు బోధల నందించే బృహత్కార్యం చేపట్టగల సమర్థవంతమైన వారు కాబట్టే వీరిని అరుణాచల రమణులు ఆకర్షించి తమ వద్దకు చేర్చుకున్నారు. తమిళ వేదాంత గ్రంథముగా పేర్కొనబడిన 'వేదాంత చూడామణి' లో ఒక శిష్యుని విధులు ఏమిటంటే అన్నిటిలోకి తన గురువు బోధలను పదిలపరచడమే అతి ముఖ్యమైన విధి అని చెప్పబడి యున్నది. శ్రీ రమణులు తరచుగా వేదాంత చూడామణిలోని వాక్యాలను ఉదహరిస్తూ ఉండేవారు. మరి ఈ ముఖ్యమైన కర్తవ్యాన్ని నెరవేర్చుటకై గంభీరం శేషయ్య గారు శ్రీ రమణుల సన్నిధికి, రమణుల కృప చేత రాగలిగారు.

నిజానికి 'గంభీరం' అనేది శేషయ్య గారి కుటుంబానికి ఇవ్వబడిన బిరుదు. శేషయ్య గారి ముత్తాత ఒక రాజు వద్ద పనిచేస్తూ ఉండే రోజుల్లో వారికి 'గంభీరం' అనే బిరుదును రాజు ప్రధానం చేశారు. తెలుగులో 'గంభీరము' అంటే 'ఠీవి' అని అర్థం. ఠీవి గలిగి గొప్ప వంశానికి చెందిన ఉద్యోగి అని అర్థం. విధి చేత

నిర్ణయింపబడినట్టుగా రమణులు అరుణాచలంలో భిక్షకు వెళ్లిన తొలి రోజులలో ఒక ఇంటి ముందు నిలబడి శ్రీరమణులు భిక్ష కోసం చప్పట్లు కొట్టగానే ఇంటి పెద్ద ఎంతో సిగ్గుతో ఇంటి లోపల నుండి భిక్ష తెచ్చి శ్రీ రమణులకు సమర్పించారు. ఆ వ్యక్తి ఎవరో కాదు. వారు గంభీరం శేషయ్య గారి సోదరులు గంభీరం కృష్ణ అయ్యర్. శ్రీ రమణ కృపాకటాక్ష వీక్షణం సోకిన గంభీరం కృష్ణ అయ్యర్ ఆనాటి నుండి తిరిగి ఎన్నడు జూదము, చీట్లపేక-- వీటి జోలికి పోనే పోలేదు.

స్వామి వివేకానందుల వారిచే యోగము మీద మరియు వేదాంతం మీద రచించబడ్డ గ్రంథాలను గంభీరం శేషయ్య గారు కౌమార దశ నుండి అధ్యయనం చేసేవారు. అందు ప్రతిపాదన చేయబడిన వేదాంతపరమైన విషయాలు వారిని ఎంతో ప్రభావితం చేశాయి. ప్రభుత్వ అధికారి అయిన గంభీరం శేషయ్య గారు ఈ విధంగా మంచి వేదాంత పరిజ్ఞానం కూడా సంపాదించారు. 1900 సంవత్సరంలో ఆయనకి తిరువణ్ణామలైకు బదిలీ అయ్యింది. విరూపాక్ష గుహలో సమాధి స్థితిలో ఉన్న బ్రాహ్మణ స్వామి గురించి వారు వినడం జరిగింది. వేదాంత విషయాల మీద వారికున్న ఆసక్తి, కుతూహలం కారణంగా వారు రమణులను దర్శించాలనుకున్నారు. ఒకరోజు బ్రాహ్మణ స్వామి దర్శనార్థం విరూపాక్షగుహకు వెళ్లారు. భగవాన్ తొలి చూపుతోనే శేషయ్య గారు వారి వశులై పోయారు. తాను చదివిన వేదాలలోని సారము, ఇంతవరకూ తాను అన్వేషిస్తున్న ఆత్మసత్యమే మానవ రూపందాల్చి శ్రీరమణుల

రూపంతో విరూపాక్ష గుహలో వారికి దర్శనమిచ్చింది అని వారు గ్రహించారు.

స్వామి వివేకానందుల వారిచే రచించబడ్డ వేదాంత గ్రంథాలు భగవాన్ వద్దకు తెచ్చి శేషయ్య గారు వారికున్న సందేహాలన్నిటిని తీర్చవలసిందిగా రమణులను కోరారు. శ్రీ రమణులు మౌనంలో ఉన్నారని భావించి శేషయ్య గారు వారికి తోచిన ప్రశ్నలను కాగితంపై వ్రాసి భగవాన్ ముందు పెట్టేవారు. శ్రీరమణులు శేషయ్య గారి ప్రశ్నలకు వ్రాతపూర్వక సమాధానాలు ఇచ్చేవారు.

ఈ విధంగా గంభీరం శేషయ్య గారు శ్రీ రమణులను అద్భుత మైన వేదాంత ప్రశ్నలు అడగటమే కాకుండా వేదాంత గ్రంథాలలోని కఠినతరమైన భాగాలను, అంశాలను క్లుప్తంగా సులభ శైలిలో వ్రాసి ఇమ్మని శ్రీ రమణులను అభ్యర్థించే వారు. వారిరువురూ అనేక వేదాంతపరమైన విషయాలను చర్చించుకునేవారు. వాటన్నిటికీ సులభమైన పరిభాషలో పురాణాంతర్గతమైన పదజాలంతో శ్రీ రమణులు ఎంతో చక్కటి వివరణను శేషయ్య గారికి అనుగ్రహించారు. వానిలో కొన్ని ప్రశ్నలు ఆత్మ విచారణకు సంబంధించినవి కాగా, మరికొన్ని యోగ సాధన, ఏకాగ్రత, ధ్యానము, ముక్తి, అష్టాంగయోగము మొదలైన వానికి సంబంధించి నవిగా ఉండేవి. ఇలా అష్టాంగయోగము, ప్రాణాయామము, యోగము... ఇలా అనేక ఇతర మార్గాలలోని మర్మాలను శ్రీ రమణులు విశదపరిచినప్పటికీ వారు ఎప్పుడు సూటిమార్గమైన జ్ఞానమార్గము విశిష్టతను నొక్కి వక్కాణించేవారు. యోగమార్గము,

మనస్సనే పొగరుబోతు గిత్తను తాళ్లతో బంధించి బలవంతంగా లొంగదీయడం వంటిది. మరి జ్ఞానమార్గము, ఆ గిత్తను మొదట పచ్చగడ్డి వేసి శాంతపరిచి, క్రమేపీ దారిలోనికి తెచ్చుకోవడం వంటిది అని రమణులు శేషయ్య గారితో అనేవారు.

వేదాంత పరమైనటువంటి ఎన్నో అంశాలను గంభీరం శేషయ్య గారి ద్వారా శ్రీ రమణులు భక్త లోకానికి అందించారు. గంభీరం శేషయ్య గారు తమ ప్రశ్నోత్తరాలు ఉన్న చీటీలను పుస్తకాలను భగవాన్ భావితరాల భక్తులకు అందించడానికి కారణ భూతులైనారు. ఇలా లోకానికి ప్రదానం చేయబడ్డ వేదాంత పరమైన సమాచారమే తమిళంలో 'విచార సంగ్రహం' అనే పేరుతో శ్రీ రమణ బోధలను కలిగిన ప్రథమ గ్రంథంగా ప్రచురించబడినది. ఈ గ్రంథం తర్వాత కాలంలో ఆంగ్లంలోనికి అనువదించబడినది. ఆ గ్రంథం పేరు 'ప్రశ్నోత్తర విచారణ'. ఆ పేరును తదుపరి 'ఆత్మ విచారణ' గా మార్చారు. శ్రీ రమణులు విరూపాక్ష గుహలో నివాసం చేస్తున్నప్పుడు గంభీరం శేషయ్య గారి వలె ఎందరెందరో మహా భక్తులు వారి సన్నిధానాన చేరి తరించారు. వారిలో కొందరు శ్రీ రమణులను గురువుగా, మరికొందరు తల్లిగా, తండ్రిగా, ఇంకొందరు దైవంగాను భావించి ఆరాధించేవారు.

ఇలా శ్రీ రమణులను ఎవరైతే తండ్రిగానో తల్లిగానో గురువు గానో భావించి ఆరాధిస్తారో వారందరినీ కృప చేత అనుగ్రహించి తరింప చేస్తారు గురు రమణులు.

******

## అధ్యాయము - 4

# భగవాన్ భక్తులు - గోవులు

**శ్రీ రమణాశ్రమ ప్రచురణ** Bhagavan Ramana The Friend of all **లోని 4వ అధ్యాయానికి స్వేచ్ఛానువాదం**

(గత సంచిక తరువాయి) రమేష్ బాబు

భగవాన్ గోలక్ష్మికి స్వీట్లు, పళ్ళు పెట్టే సమయంలో ఒక ఫోటో తీశారు. ఇంకొక ఫోటో భగవాన్ ఆవుల మంద మధ్యలో కూర్చున్నప్పుడు తీశారు. అదొక గొప్ప రోజు, ఆనాటి మేటి ఫోటోలన్నీ ఇప్పటికీ మనం ఆశ్రమంలో చూడవచ్చు.

భగవాన్ అభిమాన పాత్రమయిన భక్తురాలిగా ఎంతోకాలం కొనసాగింది గోలక్ష్మి. ప్రారంభ సంవత్సరాలలో స్థిరమైన సహవాసము కలిగే దాకా ఎక్కువసార్లు దర్శనానికి వచ్చేది. తరువాతి కాలంలో అన్ని సార్లు కాకుండా, సందర్భాన్ని బట్టి దర్శనం చేసుకుని భగవాన్ కరుణాప్రవాహాన్ని తనలో నిలుపుకున్నది. మానవ భక్తులకు కూడా కొందరికి ఇలాగే జరిగింది.

గోలక్ష్మి భగవాన్ దర్శనానికి ఎప్పుడు వచ్చినా శ్రద్ధ కనబరచి గోలక్ష్మిని పిలిచి, వీపుతట్టి, నిమిరి, అరటిపళ్ళు, ఇడ్లీలు, చక్కెర పొంగలి వంటి ఆహారపదార్థాలు తినిపించేవారు.

గోలక్ష్మి తన ఆహారం పట్ల ప్రత్యేక దృష్టి కలిగి వుండేది. ఆమెకు కొండ అరటి పళ్ళు చాలా ఇష్టం, సాధారణ అరటిపళ్ళు ఆమె అంత ఇష్టపడదు. ఆమె ఎప్పుడు వచ్చినా భగవాన్ ఆమె పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించేవారు. పరిచారకులను పిలిచి వెళ్ళి చూడండి.

“కొంత అరటి పళ్ళు కొన్ని తెచ్చి పెట్టండి” అని చెప్పేవారు.

పరిచారకులందరూ భగవాన్ భక్తురాలి అవసరాల కొరకు ఉరుకులు, పరుగులు పెట్టేవారు. గొప్ప భక్తి, అనుకూల ప్రవర్తన గోలక్ష్మికి భగవాన్ వద్ద ఎల్లవేళలా ప్రవేశానికి అర్హత కలిగించాయి. భగవాన్ నుండి గొప్ప శ్రద్ధ, దయ ఆమెపై వర్షించాయి.

గోలక్ష్మి ఈ జన్మలో ఆవుగా జన్మించినా ఇప్పటి భగవాన్‌తో గల ఈ ప్రత్యేక అనుబంధం అది పూర్వ జన్మల బంధమని భక్తుల నమ్మకం. ప్రేమ, శరణాగతి, భగవాన్ కరుణకు ప్రత్యేక బంధం.

గోలక్ష్మి ఈ జన్మలో ఆవుగా జన్మించినా భగవాన్ కరుణకు, ప్రత్యేక అనుబంధానికి, ఆమెకు భగవాన్ పట్ల కలిగిన ప్రేమ, శరణాగతికి పూర్వ జన్మ బంధం కారణమని భక్తుల విశ్వాసం. భగవాన్ ఎల్లవేళలా ఆమె పట్ల చూపిన సున్నితత్వము, సంరక్షణ తత్త్వము, ఎందుకో చెప్పడం చాలా కష్టం. భగవాన్ సహజంగా అందరిపట్ల ప్రేమ, దయ, సంరక్షక భావాలతోనే ఉంటారు. అది ఎప్పుడో అరుదుగా తేట తెల్లమవుతుంది. అందుకు విరుద్ధంగా భగవాన్ గోలక్ష్మి పట్ల వారు చూపిన సాటిలేని కరుణ, లక్ష్మి ప్రతిస్పందించిన తీరు చాలా అపురూపమైన విషయం.

శ్రీ రమణాశ్రమంతోనూ, భగవాన్ రమణులతోనూ చిరకాల పరిచయం ఉన్న భక్తులు, కీరపాటి అవ్వ గోలక్ష్మిగా పునర్జన్మ ఎత్తిందని నమ్ముతారు.

తిరువణ్ణామలైలో భగవాన్ విరూపాక్ష గుహలో ఉండే రోజులలో ఎంతో భక్తి కలిగి ఉండేది కీరపాటి.

ఆమెకు చేతనైనంత వరకు భగవానుకు సహాయం చేస్తూ ఉండేది. 1921లో ఆమె మరణించే వరకు తరచూ తాను వండుకున్న దాంట్లో భగవాన్‌కు కూడా పెట్టేది. భగవాన్ ఎప్పుడూ గోలక్ష్మి కీరపాటి అవతారం అని చెప్పలేదు. కానీ కొన్ని సందర్భాలలో అప్రయత్నంగానూ, కొన్నిసార్లు సామాన్యంగా వచ్చిన భగవాన్ మాటలు, భక్తుల నమ్మకాన్ని బలపరుస్తున్నాయి.

వారి స్థిరమైన, దృఢమైన వాదన ఆత్మకు జన్మ, పునర్జన్మలు లేవు. ఆత్మకు జననము, మరణము, పునర్జన్మ అనేవి పూర్తిగా భ్రాంతి మాత్రమే అంటారు. అందువలననే భగవాన్ ఎవ్వరినీ వారు పునర్జన్మ పొందారు అని అనరు.

గోలక్ష్మి, కీరపాటి పునర్జన్మ గురించి భగవాన్ ఎక్కడా మాట్లాడి ఉండకపోవచ్చు. అయినప్పటికీ చాలా మంది భగవాన్ ద్వారా వివిధ సందర్భాలలో ఇద్దరిని గురించి, వారి భక్తి తాదాత్మ్యత గురించి మాట్లాడిన మాటలు ఇద్దరూ ఒక్కటే అన్న భావం కలిగించి ఉండవచ్చు.

ఆ గొప్ప భక్తి కలిగిన వృద్ధురాలు కీరపాటి ఎంతో అణకువగల గోలక్ష్మి శరీరముతో భగవాన్ పాదాల చెంత తన కర్మావశేషము పూర్తి చేసుకొనుటకు వచ్చి యుండవచ్చు.

**26-01-1946 నాడు భగవాన్ జ్ఞాపకాల గనిలోకి వెళ్ళిన మనః స్థితిలో భక్తులతో కీరపాటి గురించి పంచుకున్న కొన్ని స్మృతులు.**

భగవాన్ తిరువణ్ణామలై వచ్చిన తొలిరోజులలో, అరుణాచలేశ్వర దేవాలయంలో ఉండేది కీరపాటి. కొన్ని రోజుల

తరువాత అక్కడే ఉన్న సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో ఉంటూ సాధువులకు అన్నదానం చేసేది. ఆ రోజుల్లో ఆమెకు ఉంగరాల ముంగురులుండేవి. తరువాత కాలంలో భగవాన్ అరుణాచల పర్వతం పైన గల విరూపాక్ష గుహకు చేరుకున్నారు. ఆమె గుహ నమశ్శివాయ దేవాలయం మండపంలో ఉండేది. అప్పుడు ఆమె తల పూర్తిగా గుండుగా ఉండేది.

ఆమె ఉదయాన్నే నిద్రలేచి అరుణాచలం కొండమీదకి వెళ్ళి ఆవు పేడ, ఎండు కర్రలు సేకరించి తెచ్చుకునేది. వంటకు కొండ మీద పండే ఆకు కూరలు కూడా తెచ్చుకునేది.

ఆమెకు ఒకటే కుండ ఉండేది. ఆ కుండతో నీళ్ళు కాచుకుని స్నానం చేసేది. తరువాత ఆ కుండలోనే అన్నం వండుకునేది... అన్నాన్ని ఆకులో ఒక ప్రక్క ఉంచుకొని, అన్నంలో తినడానికి కూర వండుకునేది. అన్నీ ఆ ఒక్క కుండతోనే వండుకునేది.

దేవాలయంలోని మండపంలో స్తంభాల మీద, గోడల మీద ఉన్న దేవతామూర్తుల కందరికీ పూజలు చేసేది. ఆ తరువాత ప్రసాదం పెట్టేది. ఆ తరువాత భగవాన్‌కు ప్రసాదం పెట్టేది. భగవాన్ ప్రసాదం తిన్న తరువాతే ఆమె భోజనం చేసేది. సాయంత్రం ఆమె అరుణాచలం పట్టణంలోకి భిక్షకు వెళ్ళేది,..

ఆమె భగవాన్‌తో ఎంతో ప్రేమానుబంధాలతో ఉండేది.

భగవాన్ కొన్నిసార్లు కొండమీదకు వెళ్ళి ఆకుకూరలు, కొన్ని సార్లు అడవిలో దొరికే కూరగాయలు తెచ్చేవారు. ఆమెకు కూరలు కడిగి కోసి ఇవ్వడంలో సాయం చేసేవారు. ఆమె ప్రతిరోజూ విధిగా

భగవాన్‌కు భోజనం తెచ్చిపెట్టేది. భగవాన్ కొండమీద ఉన్నప్పుడే 1922కు ముందే ఆమె మరణించింది. ఆశ్రమానికి దగ్గరలో ఉన్న దక్షిణామూర్తి దేవాలయానికి ఎదురుగా ఉన్న చింతచెట్టు క్రింద ఆమెను సమాధి చేశారు.

గోలక్ష్మి, కీరపాటి ఇరువురూ ఒకే ఊరికి (గుడియాత్తం) చెందిన వారు అని భగవాన్ చెప్పారు. గోలక్ష్మికి ఇష్టమైన కొండ అరటి పళ్ళు, భగవాన్ తన చేతుల మీదుగా ఎంతో ప్రేమతో తినిపించేవారు. భక్తులు కీరపాటి సేవలకు ప్రతిగా భగవాన్ గోలక్ష్మికి తినిపిస్తున్నారని భావించేవారు.

1948లో మరణించేదాకా గోలక్ష్మి తన నూతన గోశాలలోనే కాపురమున్నది. తరువాత కాలంలో ఆమె హాలుకు రావడం రాను రానూ తగ్గిపోయింది. భగవాన్ ప్రతిరోజు గోశాలకు వెళ్లి ఆమెను చూసి వచ్చేవారు. లక్ష్మి భగవాన్‌తో ఎక్కువ సేపు గడపాలని కోరుకునేది. 1940 తరవాత ఆశ్రమంలో భక్తుల రద్దీ ఎక్కువైంది. లక్ష్మికి హాలు ప్రవేశం దుస్సాధ్యమైంది. జీవితంలోని చివరి సంవత్సరాలలో హాలుకు వెళ్ళడం కంటే భగవాన్ తన వద్దకు వచ్చి ఆశీర్వదించి వెళ్ళడంతోనే సంతృప్తి పడవలసి వచ్చింది.

లక్ష్మి నిర్యాణ సమయంలో అక్కడే వున్న భగవాన్ భక్తురాలు సూరినాగమ్మ ఆమె ''రమణాశ్రమ లేఖలు'' రచనలో ఆ సంఘటనలన్నీ గ్రంథస్థం చేశారు.

ఆవులరాణి గోలక్ష్మికి అమ్మ అళగమ్మకు మోక్షమిచ్చినట్లు శుక్రవారం 18వ తేదీనాడు విదేహముక్తి ప్రసాదించారు. నేను ఆ

రోజు ఉదయం ఆశ్రమానికి వెళ్ళే వేళకు లక్ష్మి ఆరోగ్యం చాలా తీవ్రంగా ఉన్నది. బహుశా ఈ రోజు గడవడం కష్టమేమో! అని చెప్పారు.

భగవాన్ దర్శనం కూడా చేసుకోకుండా నేను తిన్నగా గోశాలకు వెళ్ళాను. దూడల కోసం కట్టిన గది ఖాళీ చేసి, శుభ్రం చేసి, ఎండు గడ్డితో పడక ఏర్పాటు చేసి పడుకోబెట్టారు.

మామూలుగా శుక్రవారం నాడు పసుపు, కుంకుమ బొట్టు పెట్టి, కొమ్ములకు పూల దండలు చుట్టి గోలక్ష్మి మెడలో పూలమాల వేసి అలంకరిస్తారు. వెంకటరత్నం గోలక్ష్మి ప్రక్కన కూర్చొని ఆమెకు విసనకర్రతో విసురుతూ కూర్చున్నారు. లక్ష్మి క్రింద పడుకుని ఉన్నా తన ఠీవి గల చూపులతో చుట్టూ కాంతులు వెదజల్లుతున్నది. ఆమెను చూడగానే కైలాసంలో పరమశివునికి అభిషేకం చేయడానికి పాలు ఇవ్వడానికి వెళ్ళుచున్న కామధేనువును గుర్తుకు తెస్తుంది.

నేను భగవాన్ వద్దకు వెళ్ళి వారికి సాష్టాంగ దండ ప్రణామం చేసి లేచిన తరువాత వారు నా వంక ఒక దివ్యమైన చూపు చూశారు. ఆ చూపునే ఒక ఆజ్ఞగా భావించి, నేను వెళ్ళి లక్ష్మితో ఉంటాను అన్నాను. ఆయన సమ్మతి పూర్వకంగా తన తల ఊపారు.

నేను వెంటనే గోశాలకు వెళ్ళాను. వేంకటరత్నం విసనకర్ర నా చేతికిచ్చి వెళ్ళిపోయారు. నేను కూర్చుని విసనకర్రతో విసురుతూ "శ్రీరమణ ద్వాదశాక్షరీ మంత్రాన్ని, శ్రీరమణ అష్టోత్తరీయాన్ని పెద్దగా పారాయణ చేయసాగాను. గోలక్ష్మి శ్రద్ధగా వింటున్నట్టు అనిపించింది.

భగవాన్ మామూలుగా రోజులాగానే గోలక్ష్మిని చూడడానికి గోశాలకు 9:45కు వచ్చారు. గోలక్ష్మి ప్రక్కన ఉన్న ఎండు గడ్డి మీద కూర్చున్నారు. రెండు చేతులతో ఆమె తల ఎత్తి పట్టుకున్నారు. ఒక చేతితో ఆమె గొంతు, ముఖము నెమ్మదిగా నిమిరారు. ఎడమ చేయిని తలమీద ఉంచి కుడి చేతి వేళ్ళతో ఆమె గొంతు నుండి గుండెదాకా నెమ్మదిగా నొక్కసాగారు. 'ఒక పావు గంట పాటు గోలక్ష్మికి సేవచేసిన భగవాన్ 'అమ్మా' లక్ష్మి ఏమంటావో చెప్పు! నన్ను ఇక్కడ ఉండిపొమ్మంటావా! నేను ఉంటాను. కానీ ఏమి చెయ్యాలి? అమ్మకు జరిగినట్లే భక్తులంతా వచ్చి నీ చుట్టూ చేరతారు. అయినా కానీ ఎందుకు? సరే నేను వెళ్ళనా? లక్ష్మి అలాగే మౌనంగా ఉన్నది. శరీరంలో ఉన్న నొప్పులు, ఇహలోక బంధనాలు అన్నీ వదులుకున్నట్లు ఆమె సమాధిలో ఉన్నది.

భగవాన్ గుండె నిండా దయ నింపుకుని అక్కడ నుండి కదలడానికి ఇష్టం లేనట్లు కూర్చున్నారు.

ఆ సన్నివేశం చూడగానే నేను ఆశ్చర్యంతో పొంగి పోయాను. అసంకల్పితంగా భగవాన్ చిరునవ్వుతో నా వంక చూశారు. నా నోట వచ్చిన మాట "ఓహో! అమ్మ అళగమ్మకు దక్కిన అతి గొప్ప అదృష్టం ఇప్పుడు గోలక్ష్మికి దక్కింది" అన్నాను. భగవాన్ చిరునవ్వుతో నా వంక చూశారు.

సుబ్రహ్మణ్యం వచ్చి "డాక్టరు గారు ఉ॥ 10.30 దాకా వచ్చేటట్టు లేరు, ఎందుకంటే లక్ష్మికి అత్యసవరంగా ముంచు కొచ్చిన ఆపద ఏదీ లేదు కదా! అన్నాడు.

భగవాన్ "అయితే సరే", ఇప్పుడు డాక్టర్ రావడం లేదు. ఇంజక్షన్ ఇవ్వడానికి కావలసిన మందు తెచ్చావా? అని అడిగారు. లక్ష్మి వైపు తిరిగి సున్నితంగా ఆమె తలమీద, మెడమీద సవరిస్తూ 'నువ్వు ఏమంటావు లక్ష్మి! నేను వెళ్ళవచ్చా?' అన్నారు.

సుబ్రహ్మణ్యం భగవాన్ ప్రక్కన ఉంటే ఆమె చాలా ఆనందంగా ఉంటుంది అన్నాడు. అది సరే! అయితే ఏమి చెయ్యాలి? అని చెబుతూ భగవాన్ లక్ష్మి కళ్ళల్లోకి చూస్తూ ఏమిటి? నేను వెళ్ళవచ్చా? నీవు చెప్పవు కదా? అన్నారు. లక్ష్మి సగర్వంగా భగవాన్ వంక చూసింది. భగవాన్ కు ఏమి సమాధానం వచ్చిందో మనకు తెలియదు. అయితే భగవాన్ లేచి నిలబడి ఆమె నోట్లోకి ఈగలు వెళ్ళకుండా చూడండి అని అన్నారు.

నేను, లక్ష్మి విషయంలో మేము జాగ్రత్త వహిస్తామని మాట ఇచ్చాను. అయిష్టంగానే భగవాన్ ఆ ప్రదేశాన్ని వీడి వెళ్ళారు. భగవాన్ దివ్య స్పర్శ తగిలిన తరువాత గోలక్ష్మి శ్వాస నెమ్మదించింది. శరీరంలో కదలికలు కూడా తగ్గసాగాయి.

డాక్టరు 10.30 దాటాక వచ్చి గోలక్ష్మికి ఒక ఇంజక్షన్ చేశారు. లక్ష్మి చలనం లేకుండా ఆ శరీరం తనది కానట్లు స్తబ్దుగా ఉన్నది. ఆమెకు మరణ యాతన లేదు. ఆమె దృష్టి నిశ్చలంగా స్వచ్ఛంగా ఉన్నది. డాక్టరు ఆమెను నంది భంగిమలో కూర్చో బెట్టారు. ఆమె కురుపులకు మందు రాశారు. తలక్రింద ఎత్తు పెట్టమని మాకు సూచనలిచ్చారు.

ఉదయం 11.30 వేళ వేంకటరత్నం భోజనం చేసి వచ్చాడు. తలక్రింద ఎత్తు పెట్టాలని చెబితే కొంత ఎండు గడ్డిని తెచ్చాడు.

ఆవు నాలుక నాకు తగిలింది. అది మంచుగడ్డలా చల్లగా ఉన్నది. లక్ష్మి జీవితం శ్రీరమణుని పాదాల చెంత చేరి ఆయనలో లీనమై పోయింది.

పది నిముషాల తరువాత భగవాన్ షెడ్ లోకి వచ్చి “అంతా అయిపోయిందా? అని ఆమె ప్రక్కన కూర్చుని, ఆమె ముఖాన్ని రెండు చేతులతో చిన్న పిల్లను పట్టుకున్నట్లు పట్టుకుని పైకి లేపి; ఓ లక్ష్మి, లక్ష్మి... అని పిలిచారు మావంక చూస్తూ, బలవంతంగా కన్నీళ్ళు ఆపుకుంటూ ఆశ్రమ కుటుంబం ఇంత పెద్దదిగా ఎదిగిందంటే దానికి మూల కారణం గోలక్ష్మి. మేమంతా లక్ష్మిని అభినందిస్తుంటే భగవాన్ “డాక్టరు లక్ష్మిని పెద్దగా బాధించలేదు కదా? ఆమె జీవితం ఎలా ముగిసింది అని అడిగారు. మేము జరిగినదంతా వివరించాము.” అదంతా సరే, మీరు ఇది గమనించారా? కుడి చెవి పైకి లేచి ఉన్నది చూడండి. నిన్నటి దాకా ఆమె అవతలివైపు తిరిగి పడుకుని ఉన్నది. శరీరం మీద పడ్డ పుండ్ల వలన ఆమె ఇవతలి వైపుకు తిరిగింది. అందువలన ఈ చెవి పైకి వచ్చింది.

కాశీలో మరణించిన వారికి శివుడు కుడి చెవిలో తారక మంత్రం చెబుతాడని అంటారు. లక్ష్మికి కూడా కుడిచెవు పైకి తిరిగి ఉన్నది అని చెప్పి భగవాన్ అందరికీ ఆ చెవుని చూపించారు.

ఆ సమయానికి జనం బాగా గుమిగూడడం మొదలైంది. భగవాన్ లేచి నిలబడి రామకృష్ణ పదిరోజుల నుండి గోలక్ష్మికి చక్కని సమాధి నిర్మించాలని చెబుతున్నాడు అని చెప్పి హాలుకు వెళ్ళారు.

******

# అనుస్మరణీయులు
## శ్రీ పిమ్మరాజు రామ సుబ్బారావు

శ్రీ రమణుల అనుగ్రహం సంపూర్ణంగా పొందిన వారు, శ్రీరమణులలాగ కౌపీనం మాత్రమే ధరించి గత 35 సంవత్సరాల పైబడి మౌనంతోనే భక్తులందరిని అనుగ్రహిస్తున్నటువంటి వేల్పూరు మౌనస్వామి వారు అనే గొప్ప మహాత్ములను శ్రీ రమణ కేంద్రం భక్తులకు పరిచయం చేసినవారు శ్రీ పిమ్మరాజు సుబ్బారావు గారు. వారు 15-07-1932లో శ్రీ సీతారామయ్య, శ్రీమతి రామమ్మ గార్లకు జన్మించారు. వారికి ఒక అక్క ఉండేది. అక్కయ్య గారి పేరు రాజేశ్వరి.

సుబ్బారావు గారిని 1977లో మొట్ట మొదటిసారి పుట్టపర్తి శ్రీ సత్యసాయి బాబా గారు పిలిపించుకొని మరీ దర్శనమీయటంతో బాబాగారి అనుగ్రహంతో ఆధ్యాత్మిక పథంలో ఉన్నత శిఖరాలను అధిరోహించటం ప్రారంభమైనది. వారు చాలా కాలం బాబాగారు సూచించిన మార్గాన్ని అనుసరించి సుమారుగా 1989వ సంవత్సరంలో డా. కే.యస్.గారి పరిచయంతో శ్రీ రమణుల మార్గములోకి అడుగిడి తుది శ్వాస విడిచే (20-10-2002వ సంవత్సరం) వరకు శ్రీ రమణులనే వారి ఆరాధ్య దైవంగా భావించారు. వేల్పూరు మౌనస్వామి వారు వారితో ఒకసారి ఇలా అన్నారట - ''మిమ్మల్ని రమణులు చెయ్యి పట్టుకొని, బ్రహ్మానందంలో ముంచి తీసుకు వెళతారు'' అని. వారి జీవితంలోని ఆఖరు క్షణాలలో అరుణాచల నామము ఉచ్చరిస్తూ ఉండగా వేల్పూరు మౌనస్వామి వారు తెలియ చేసిన విధంగా ఆధ్యాత్మిక

ఆనందంలో అరుణాచల నామాన్ని స్మరిస్తూ తమ తుది శ్వాస విడిచి పెట్టిన మహనీయులు. వారి మనస్తత్వం చంటి పిల్లల మనస్తత్వంలా ఉన్నా, వారి సంకల్పాలు చాలా ధృడంగా ఉండేవి. వారు జిల్లెళ్ళమూడి అమ్మవారిని కూడా దర్శించుకొన్నారు. ఎంతో మంది మహాత్ములు వారింట భిక్ష చేశారు. అటువంటి వారు సాయి మార్గంలోకి మరియు శ్రీరమణ మార్గంలోకి ఎలా వచ్చారో వారి కుమార్తెలైన శ్రీవాణి గారు, శ్రీదేవి గారు మరియు వారి పెద్ద అల్లుడు కొమరవోలు రవి గారి మాటలలో తెలుసుకొనే ప్రయత్నం చేద్దాము.

**సుబ్బారావుగారి గురించి వారి పెద్దల్లుడు గారు తెలియచేసిన విషయములు:**

మా మామయ్య గారితో నాకు ఆత్మీయ అనుబంధం ఉన్నది. శ్రీ సుబ్బారావు గారు బెంగుళూరులో ఆంధ్రప్రభ దినపత్రికలో సీనియర్ సబ్ ఎడిటర్‌గా పని చేసేవారు. వారు గాయత్రీ మంత్రోపాసకులు. గాయత్రి మంత్రాన్ని నిరంతరాయంగా జపించేవారు. మంత్రోపాసన చేస్తున్న సమయములో వారికి అమ్మవారి గజ్జల సవ్వడి కూడా వినపడేదట. అలా మంత్రోపాసన చేయటం వలన వారికి కొన్ని దర్శనాలు జరిగాయి. వారికి ఒకానొక సమయంలో ఆర్థిక పరిస్థితులు చాలా ఇబ్బందికరంగా ఉండడంతో - భగవంతుడే గనుక ఉంటే ఆయనే నా వద్దకు రావాలి' అని గట్టిగా అనుకున్నారట. అదే సమయంలో బెంగుళూరు వైట్ ఫీల్డ్‌లో బాబాగారిచ్చిన ప్రసంగాలను అనువాదం చేయవలసినదిగా వీరిని ఆంధ్రప్రభ పత్రిక వారు కోరటంతో వారు ఆ ప్రసంగాలను అనువాదం చేశారట. (సశేషం)

## The Universal Mother

Dr K Subrahmanian

Some of us recite the *Sri Lalitha Sahasranamam* every Friday, and during *Navratri*, every day. At the time of *Dusshera*, there is a powerful atmosphere in the country because people are doing *puja*, *japa*, and meditation. It becomes easier for us to do *puja* and *japa* during this time because of this kind of atmosphere. When we listen to the *Lalitha Sahasranamam*, especially on a Friday, it gives us all the peace we need; and this peace, which is beyond words, is given to us through the Mother's grace. Reciting, or just listening to the thousand names of the Universal Mother being recited, gives us a sense of peace because of the positive vibrations. When we submit ourselves to the chanting, the mind becomes still. The verses describe the various qualities of Ambal, the universal mother.

*Sri Maata Sri maharagni, srimat simhaasaneshwari.*

*Chidagni kunda sambhuta deva karya samudyata.*

This is how the *Lalitha Sahasranam* begins. Where is this mother, and what does she look like?

*Chit agnikunda sambhuta* – the Universal Mother was not born in the ordinary way, but she was born out of the fire of consciousness; she is consciousness itself, and therefore, extraordinary.

*Udyat bhanu sahasrabha*- her brilliance is like that of a thousand suns rising at the same time.

*Chaturbhaahu samanvita, raaga swaroopa paashadya krodha kaaran kushojwala*- she is the creator of the many

desires in us; because of her *leela*, she creates desires like *raga* and *dwesha*. Just as she is responsible for creating these things, she can also destroy the desires within us.

*Sarvaloka vashankaree* - she has control over everything in this universe.

*Lokateeta gunateeta sarvateeta shamatmika* - she is beyond this world.

*Bhavani bhaavana-gamya, bhavaaranya kutharika* - is there any way in which we can find our way out of this huge forest of *samsara*? There are so many trees and most of us get lost in them. It is only the Mother who can help us find a way through the dense forest, for she is the one who can cut down all these trees (*kuthaarika)* and give us peace.

*Samsara bandhanas*–getting stuck in the world of *samsara*, which is *maya*, is like getting stuck in mud. As we walk around, the slush gets stuck to our feet, and as we sink deeper and deeper, we find that we are unable to move.

*Samsarapanka nirmagna samudharana pandita* - the only person who can take us out of this quicksand of *samsara* is the Mother.

*Antarmukha samaraadhya, bahirmukha sudurlabha*– we may think it will be very difficult to realise her; but this, however, is not true. When we begin to look deep within ourselves, we will be able to achieve this, and that too, quite easily.

*Drishti* is *antarmukha* – we can see her within ourselves through meditation, *puja* and *japa*.

*Samsara-pankanirmagna* - the only way we can be saved in this world is through her grace; that is the only way we can be lifted out of this mud of *samsara.*

